క్లుప్తంగా

మెడికోలపై పోలీసుల దాడి అమానుషం


బుగత శివ, ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రత్తిపాడు: విజయవాడలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలపై పోలీసులు దాడి చేయడం అమానుషం అని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కార్యదర్శి బుగత శివ అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెడికోలపై జరిగిన దాడిని ఐలాజ్ ఖండిస్తుందన్నారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువ వైద్యులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల నిరసనను పోలీసుల ద్వారా అణచివేయడం ప్రజాస్వామ్య సూత్రాలకి విరుద్ధమని ఐలాజ్ బావిస్తోందన్నారు. తక్షణమే యువ వైద్యులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని, వారిని వైద్యులుగా గుర్తించాలని, వైద్యులపై దాడి చేసిన పోలీసులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

పల్లెల్లో పారిశుధ్యానికి పెద్దపీట


ఇందుగపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నారాయణ

కోటనందూరు: పల్లెల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ అన్నారు. బొద్దవరం, టీజే నగరం, ఇండుగపల్లి, బిళ్లనందూరు, ఎస్సార్‌పేట, భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ఆరు గంటలకే ఆయా గ్రామాలకు వెళ్లి డ్రైన్ల క్లీనింగ్, డంపింగ్ యార్డులు, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, హ్యాండ్ బోర్ల పనితీరు పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్ జయరాం పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళులు


జగ్గంపేటలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, ఆర్థిక మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక వ్యక్తి కొణిజేటి రోశయ్య జయంతిని జగ్గంపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రోశయ్య చిత్రపటానికి ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్య వైశ్య సేవా సంఘం రాష్ట్ర నేత కొత్త కొండబాబు, సంఘ నాయకులు కంచర్ల శ్రీనివాస్, మానేపల్లి బంగార్రాజు, వి.నాగసత్య, కంచర్ల బాబు, వీర్రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


శంఖవరంలో వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్సై హరిబాబు

శంఖవరం: ట్రిప్పర్ లారీ డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నవరం ఎస్సై జి.హరిబాబు హెచ్చరించారు. శంఖవరంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో వెళుతున్న ట్రిప్పర్లను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. అతివేగంగా వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని పెదశంకర్లపూడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పసతులలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రాజబాబు, మాజీ సైనిక ఉద్యోగి కర్రి ధర్మరాజు, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, వరుపుల రామకృష్ణ, దోె నవీన్, సీఆర్పీ గంగారావు తదితరులు పాల్గొన్నారు.

పంపాకు జలకళ

- 92 అడుగులకు చేరిన నీటిమట్టం
- 0.21 టిఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు
- బ్యారేజీ గేట్ల వద్దకు నీరు చేరడంతో నిలిచిపోయిన మరమ్మతులు


పెరిగిన నీటి నిల్వలతో కనువిందు చేస్తున్న పంపా రిజర్వాయర్


పంపా బ్యారేజీ గేట్ల వద్దకు చేరిన నీరు

అన్నవరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక పంపా రిజర్వాయర్‌లోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఏప్రిల్ రెండో వారంలో పంపా నీటిమట్టం కేవలం 79 అడుగుల వద్ద 0.08 టిఎంసీలు నీటి నిల్వ మాత్రమే ఉండడంతో అటు అన్నవరం దేవస్థానం, ఇటు గ్రామస్తులకు మంచినీటి సమస్య ఉత్పన్నమవుతుందనే ఆందోళన వ్యక్తమైన విషయం తెలిసిందే. కాగా అప్పటి నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండంతో పంపాలోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పంపా నీటిమట్టం భారీగా పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి 92 అడుగులకు చేరుకుంది. దీంతో నీటి నిల్వ 0.21 టిఎంసీలకు చేరింది.

పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు

పంపా రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా అయిన శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని ఏజెన్సీ గ్రామాల్లో గత వారం భారీగా వర్షం కురిసింది. ఫలితంగా పంపా రిజర్వాయర్‌లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుండడంతో రిజర్వాయర్ నీటిమట్టం గత 15 రోజుల్లో దాదాపుగా నాలుగు అడుగుల మేర పెరిగింది.

పోలవరం అక్విడెక్ట్ పనులు, పంపా బ్యారేజీ గేట్లు మరమ్మతుల పేరుతో గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో పంపా రిజర్వాయర్ నీటిని దిగువకు వదిలేసిన విషయం తెలిసిందే. పంపా నీటిమట్టం మార్చి చివరి వారంలో 79 అడుగులకు పడిపోవడంతో సత్యదేవుని ఉత్సవాలకు, దేవస్థానానికి నీటి కొరత తప్పదనే ఆందోళన వ్యక్తమవ్వడంతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్వయంగా మార్చి చివరి వారంలో పంపా రిజర్వాయర్‌ను పరిశీలించారు. పంపాకు ఏలేరు నీరు విడుదల చేస్తే పోలవరం అక్విడెక్ట్, కాలువ పనులకు ఆటంకమని అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వారికి నచ్చ చెప్పి ఆ పనులకు ఆటంకం కలగకుండా ఏలేరు నీరు రావడానికి కాలువ, పైప్‌లైన్ తవ్వించారు.

ఏలేరు నీరు రాకుండానే..

ఏలేరు నీరు విడుదల కాకుండానే వర్షాల కారణంగా పంపాలోకి నీరు వచ్చి చేరింది. దీంతో గత మే నెలలో సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు ఏ విధమైన నీటి సమస్య లేకుండా ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత ఆషాఢ మాసంలో సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి తగ్గినా ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. సత్యదేవుని సన్నిధికి భక్తులు అధికంగా వస్తారు. వివాహాల సీజన్ కూడా మళ్లీ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో పంపాకు నీరు వస్తుండడంతో దేవస్థానం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గేట్ల మరమ్మతు పనులు నిలిపివేత

గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో పంపా బ్యారేజీ గేట్లు వద్దకు నీరు వచ్చి చేరింది. దీంతో నాలుగో నెంబర్ గేటు మరమ్మతు పనులు మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. పంపా బ్యారేజీకి ఖరీఫ్ అనంతరం ఐదు కొత్త గేట్ల ఏర్పాటుకు, ఖరీఫ్‌లోగా గేట్లకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి రూ.3.36 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. నాలుగో నంబర్ గేటుకు గత నాలుగు రోజులుగా మరమ్మతులు చేశారు. గత సోమవారం గేట్లు వద్దకు నీరు రావడంతో పనులు నిలిపివేశారు.

నీటిమట్టం 94 అడుగులు దాటితే ఖరీఫ్‌కు నీరు విడుదల



పంపా రిజర్వాయర్‌లోకి వర్షపునీరు వస్తుండడంతో నీటిమట్టం 91 అడుగులకు చేరింది. 94 అడుగులకు నీటి మట్టం చేరితే ఖరీఫ్‌కు నీరు విడుదల చేసే అవకాశం ఉంటుంది. పంపా రిజర్వాయర్ కింద 12,500 ఎకరాలలో ఖరీఫ్ పంటకు పూర్తి స్థాయిలో నీరు ఇవ్వాలంటే మూడు సార్లు పంపా రిజర్వాయర్ నిండాల్సి ఉంటుంది. పంపా గరిష్ఠ నీటిమట్టం 101 అడుగులు వద్ద 0.45 టిఎంసీ నీరు నిల్వ ఉంటుంది. దాదాపుగా 1.5 టీఎంసీ నీరు ఖరీఫ్‌కు అవసరం. పంపాకు గత ఐదేళ్లుగా పుష్కర నీరు విడుదలవుతుండడంతో నీటి సమస్య ఉండడం లేదు. పంపా బ్యారేజీ గేట్లు వద్దకు నీరు రావడంతో గేట్లు మరమ్మత్తు పనులు నిలిపివేశాం.

ఈఈ శేషగిరిరావు, నీటిపారుదల శాఖ, పెద్దాపురం డివిజన్

వనదుర్గ అమ్మవారికి చండీహోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, సామవేదం పండితులు సూర్యనారాయణ ఘనపాఠి, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకులు చిట్టెం వాసు, వేణు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 20 మంది భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనకదుర్గమ్మకు చీర, సారె సమర్పణ


రాజుపాలెంలో వారాహీ మాతను దర్శించుకుంటున్న తోట నరసింహం


శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

ఏలేశ్వరం: వారాహిమాత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది మహిళలు స్థానిక బాలాజీ చౌక్ నుంచి ఊరేగింపుగా వచ్చి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల కనకదుర్గ అమ్మవారికి చీర, పలు రకాల పిండివంటలతో సారె సమర్పించారు. తొలుత అమ్మవారిని కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. ఆలయంలో మహిళలు పారాయణం పఠించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, ఇందిరా, గిరిజ, దేవి, మంగామణి, స్వరాజ్యం, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వారాహీమాతకు ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో వారాహి మాత నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, ప్రధాన అర్చకులు శ్రీతేజామూర్తుల జగదీశ్వరరావు తోటకు శాలువా వేసి ఆశీర్వచనాలు అందజేశారు. కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు రామకుర్తి రామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ వరుపుల సూరిబాబు, అంకం అంజి, గంధం నాగు తదితరులు పాల్గొన్నారు.

వారాహీ నవరాత్రుల ముగింపు

గండేపల్లి: తాళ్లూరులో దుర్గాదేవి అమ్మవారికి వారాహి దేవి నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల చివరి రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో మహిళలు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన


ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎర్ర రిబ్బన్లు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెండెం సత్యానందం మాట్లాడుతూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టామన్నారు. పీటీడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కారించాలన్నారు. ఆగష్టు 15 నుంచి ప్రారంభించే ఉచిత బస్సు స్కీమ్ విజయవంతం అవ్వాలంటే 3 వేల బస్సులను కొనుగోలు చేసి 10 వేల మంది సిబ్బందిని నియమించాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించే 1/2009 సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ కృష్ణ, డిపో కార్యదర్శి నానిబాబు, నల్లయ్య, ఎన్‌వీ రావు, చలం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

గోకవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గోకవరం ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల 1/19 సర్క్యులర్ తూచా తప్పకుండా అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మహిళల ఉచిత బస్సు సర్వీసులకు సరైన బస్సులు, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని, మౌలిక అంశాలపై ఆర్టీసీ సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎం సుచరిత మార్గరేట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నల్ల వీరబాబు, ప్రధాన కార్యదర్శి పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కిరెడ్డి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ చీకట్ల వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ బొమ్మిరెడ్డి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


గోకవరం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఘనంగా వంగవీటి రంగా జయంతి


తునిలో రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు


ఏలేశ్వరంలో వంగవీటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు

తుని: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు తుని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి సూరప్పరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాపునేతలు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. సాయిఅన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో కర్రెళ్ల గణపతిరావు, దండెం రామకృష్ణ, గేలం శ్రీనివాస్, మోహన్‌రంగా, గొర్రెల నానాజీ, అద్దేపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా యూత్ ఆధ్వర్యంలో స్థానిక వైఆర్‌పీ కార్యాలయం వద్ద వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగవీటి ప్రజాసేవలో నిరంతరం పనిచేశారని కొనియాడారు. రంగా ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కాపు రాక్స్ నాయకుడు గూడపాటి చంద్రశేఖర్ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాపు నాయకులు బాదం ఆనంద్‌కుమార్, కరణం నాగార్జున, అడపా శేషగిరిరావు, కటకం కిరిటీ, పెచ్చెట్టి కృష్ణ, బొప్పన శివ, పిడుగు భద్రం, తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహాలకు కాపు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో బైక్ ర్యాలీలు చేపట్టారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారిపై శుక్రవారం బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై బి.జగన్మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం వాకదారిపేటకు చెందిన గోళ్ల బాబూరావు (45), బుచ్చియ్యపేటకు చెందిన కొయ్య గోపి బైక్‌పై కత్తిపూడి వెళ్తుండగా బెండపూడి జాతీయ రహదారిపై ఆర్చి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలవ్వగా స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. కాగా అప్పటికే బాబూరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి

- ఘనంగా మన్యం వీరుడు సీతారామరాజు జయంతి వేడుకలు
- ఆయన విగ్రహాలకు ఘన నివాళులు


ఏలేశ్వరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


తుని ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి, పింగళి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు


శంఖవరంలో అల్లూరి విగ్రహనికి పూలమాల వేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: సూర్యుడు అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. సీఐటీయూ నాయకులు పాకలపాటి సోమరాజు, పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత అల్లూరి ఆశయాలను పాటించాలని, అల్లూరి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు గండి వెంకట్రావు, సత్యనారాయణ, బత్తుల వీర్రాజు, గురయ్యమ్మ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఎంపీడీఓ నారాయణ, ఉపాధిహామీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెల్లదొరలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజనలు హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్, రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, ఎఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద అల్లూరి విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, కార్యవర్గ సభ్యురాలు అవసరాల దేవి, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అల్లూరి జంక్షన్‌లో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం నాయకులు అల్లాడి లక్ష్మి, కొమరగిరి కృష్ణ, గనిలక్ష్మి, వెంకటలక్ష్మి, బి శ్రీను, జి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన జరిగిన జయంతి కార్యక్రమంలో అల్లూరి, పింగళి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఎంపీడీఓ కె.సాయినవీన్, డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య, పలువురి సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: గ్రామంలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సామాజిక కార్యకర్త మేకల కృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. శంఖవరం ప్రధాన పాఠశాలలో అల్లూరి నడియాడి బస చేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బోర్రా సత్యనారాయణ, బొమ్మిడి సత్యనారాయణ, కోడిబోయిన భగవాన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం నంది సెంటర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్రం కోసం అల్లూరి చూపించిన వీరత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దొడ్డిపట్ల సోమన్నదొర, చుక్కల సత్య నారాయణ మూర్తి, పుణ్యమంతుల కామరాజు, నక్కల శ్రీను పాల్గొన్నారు.

తొండంగి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం చాత్రాడ.వి.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో అల్లూరి విగ్రహానికి నివాళులు


బూరుగుపూడిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న వీరాంజనేయులు

అరుణాచల క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు


రాచపల్లి అరుణాచలక్షేత్రంలో భక్తుల కోలాహలం

ప్రత్తిపాడు రూరల్: ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ భక్తులు 63 మంది నాయనార్లతో పాటు దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవుడు, సూర్యభగవానుడు, కాలభైరవుడు, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేదపండితులు గోపూజ, గణపతి హోమం, లక్ష్మీహోమం, నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద, ఆధ్యాత్మిక వేత్త అరుణాచల మాధవి పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

బోట్‌క్లబ్: ప్రతిభ గల విద్యార్థులకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది నిరుపేద విద్యార్థులకు రూ.2.40 లక్షల స్కాలర్‌షిప్‌లు అందించారు. ఎనిమిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ ట్రెజరర్ డీవీఆర్ జగన్నాథం, సభ్యులు సీమకుర్తి పాపారావు, ఎం.జనార్దన్ పాల్గొన్నారు.